# నిర్ణయం

## - తటవర్తి చంద్రసేన

డియర్ భావన,

నా ఉత్తరానికి బదులు రాసిన నీకు మరోసారి కృతజ్ఞతలు. ఒక్కసారి ఆలోచించు అందం శాశ్వతం కాదు. ప్రేమానురాగాలే చివరివరకూ నిలిచేవి. నేను మాత్రం కురూపినా! నల్లగా ఉన్నాననే కదా! వెనుకకు మళ్ళుతున్నావు. భగవంతుడు నీకు అద్భుతమైన అందాన్నిచ్చాడు. నేను కోరి చేసుకోవాలనుకుంటున్నాను.



నేను "కో" అంటే కోటిమంది అమ్మాయిలు క్యూలో నిలబడతారు నన్ను పెళ్ళాడటానికి. వారిని ఆకర్షించడానికి నా డబ్బు, హోదా చాలు. నువ్వు మా అక్క కూతురివని నేను ఇంతగా కోరుతున్నాను. అక్క అందంగా లేదని మీనాన్న మీ ఇద్దరినీ వెడిచిపెట్టి వెళ్ళిపోయాడు. ఇప్పటికీ మీ అమ్మ లోకానికి జవాబు చెప్పలేక కుమిలిపోతోంది. అక్కకు నీకు ఆసరాగా నిలవాలని నా ఆకాంక్ష. నీవు ప్రస్తుతానికి కాదన్నా, నీ మనసు మారి చేసుకుంటాననేవరకూ వేచి ఉంటాను. నీకోసం ఎప్పుడూ నాహృదయద్వారాలు తెరిచేవుంటాయి. బాగా ఆలోచించుకో.

ఇట్లు, శేఖర్

ఎవరి దగ్గర్నుంచే ఉత్తరం? తల్లి పిలుపుతో ఉత్తరం చదవడం పూర్తి చేసిన భావన "మీ



తమ్ముడేనమ్మా వ్రాసింది" అంటూ జవాబు చెప్పింది.

"మావయ్యన్లేవు? నీ వేళాకోళం కాకపోతే! ఏమి రాశాడేమిటి? వెర్రి సన్నాసి" అంటూ చేతులు తుడుచుకుంటూ అడిగింది భారతమ్మ.

"ఏమి రాస్తాడు? తనని పెళ్ళి చేసుకోమని రాశాడు. అది ఎప్పుడూ మామూలేగా! ఎవరి పిచ్చి వారి కానందం" అంటూ ఉత్తరం టేబుల్ మీద పడేసి తను మాధవ్‌కిచ్చిన ప్రోగ్రాం ప్రకారం బీచ్‌కెళ్ళడానికి తయారైంది. "అమ్మా! అలా బీచ్ దాకా వెళ్ళొస్తాను" అని తల్లితో చెప్పింది. "ఇప్పుడంత అర్జంటేమిటి?"- వంటింట్లోంచి వస్తూ అడిగింది భారతమ్మ. "మాధవ్‌ని కల్సుకుంటానని మాటిచ్చాను" అంది భావన. "పెళ్ళి కాకుండా కల్సుకోవటాలేమిటి!" కోపంగా అడిగింది భారతమ్మ.

"నేనేమీ చిన్నపిల్లను కాదు. వాళ్ళ అమ్మా, నాన్న కూడా ఒప్పుకున్నారట. నన్ను తప్ప వేరెవ్వరినీ చేసుకోనని భీష్మించుకుని కూర్చున్నాడు. పైగా కానీ కట్నం లేదు. ఇంకా చెప్పాలంటే అందగాడు. నాతోటి లెక్చరర్. అన్నింటికి మించి నాకు నచ్చాడు. నేను అతన్ని ప్రేమించాను. కానీ... కానీ... నువ్వేమో మావయ్యని చేసుకోమంటున్నావు. చూసీ, చూసీ నాకు ఇష్టంలేని పెళ్ళి చేస్తావా అమ్మా?" అంటూ దీనంగా అడిగింది భావన.

"నీ మనస్సు కష్టపెట్టేంత మూర్ఖురాలు కాదమ్మా మీ అమ్మ. అయితే ఒకటి మాత్రం గుర్తుంచుకో. నేను భర్త ఉండి లేనిదానిలాగ, నీకు తండ్రి లేకపోవడానికి కారణం ఈ అర్థం పర్థం లేని అందాలు, ప్రేమలేనమ్మా. నీ అందం చూసి ఈ మాధవ్ కాకపోతే మరో మనోహర్ చేసుకుంటాడు. నేను చెప్పాలంటే నీలాగే చాలా అందంగా ఉండేదాన్ని. ఆ అందం చూసే లక్షాధికారి అయిన మీ నాన్న నన్ను చేసుకున్నారు. నేను అందర్నీ ఎదిరించి అతన్ని చేపట్టాను. ఒక్క సంవత్సరం బాగా గడిచింది. స్వర్గమే చూశాను. ఆ సంవత్సరమే నీవు పుట్టావు. ఆ తర్వాత నాకు మశూచి వచ్చింది. ఎన్నో సంవత్సరాల అందం కొద్ది రోజులలోనే మాడిపోయింది. నేను వికృతంగా ఉన్నానని నా మొహాన కొంత డబ్బు పారేసి వేరొకర్ని చేసుకుని నా పీడ వదిలించుకున్నారు మీ నాన్న. ఆ తర్వాత మీ మావయ్య, తాతయ్య ఆసరాతో నిన్ను పెంచి పెద్ద చేసి లెక్చరర్ని చేశాను. అందుకని నీవు బాగా ఆలోచించుకో. ఈరోజు మాధవ్ నిన్ను మోహించి స్వర్గలోకాన్ని చూపించవచ్చు. కానీ ఎలాంటి పరిస్థితులలోనైనా నీ అందం పాడైతే నా జీవితంలాగా నీ బ్రతుకూ కాకూడదు అది తెల్సుకో. కడవరకు నిన్ను హృదయంలో పెట్టుకొని కాపాడగలిగేవాణ్ణి నీ జీవిత భాగస్వామిగా ఎంచుకో. అన్నీ తెలిసిన నీకు మీ అమ్మ ఇంకేం చెప్పలేదు.

బీచ్‌కెళ్ళి త్వరగా వచ్చేయి" అంటూ కూతుర్ని హెచ్చరించింది భారతమ్మ.

"సరేనమ్మా. నీవు చెప్పినట్లే చేస్తాను. ఇంత మంచి అమ్మ దొరకడం నా అదృష్టం" అంటూ తల్లి నుదిటపై ప్రేమగా ముద్దు పెట్టుకుని బీచ్‌కి బయలుదేరింది భావన. బీచ్‌లో...

"మీ అమ్మగారు చెప్పింది మంచి సలహా భావన. మనసా, వాచా నీకు ప్రమాణం చేస్తున్నాను. నేను బ్రతికి ఉన్నంతకాలం నిన్ను పువ్వుల్లో పెట్టి పూజిస్తాను. నీ అందం కాదు కావలసింది నీ మనస్సు" అంటూ చేతిలో చెయ్యి వేశాడు మాధవ్. భావన తృప్తిగా అతని కళ్ళలోకి చూసింది.

* * *

కాలేజీ ఆవరణలో

"మాధవ్ కంగ్రాట్యులేషన్స్. నీ పెళ్ళి భావనగారితో నిశ్చయమైనందుకు మాకు అందరికీ సంతోషంగా ఉంది. మా అందరికీ గ్రాండ్‌గా పార్టీ ఇవ్వాలి" అభినందించాడు ఇంగ్లీషు లెక్చరర్ రామకృష్ణ.

"తప్పకుండా!" చుట్టూ ఉన్న లెక్చరర్స్ అందరికీ ప్రామిస్ చేశాడు మాధవ్. ఇంతకీ భావన రాలేదేమిటబ్బా కాలేజీ బెల్ కూడా కొట్టేసారే? అని అనుకుంటూ ఉండగా-

ఆఫీసుబాయ్ పరుగుపరుగునొచ్చి మాధవ్‌ని ఉద్దేశించి "సార్.... సార్.... భావనమ్మగారికి ఫైర్ యాక్సిడెంట్ అయిందట. స్టౌ అంటిస్తుంటే మంట పైకెగసి....." చెప్పలేక రొప్పుతున్నాడు.

మాధవ్ ఒక్కసారి షాక్ తిన్నాడు. వెంటనే స్కూటరెక్కి భావన ఇంటికి బయలుదేరాడు.

రాక్షసిని చూసినట్లుగా ఉన్న భావన రూపాన్ని చూసి గట్టిగా అరిచాడు మాధవ్. భావన మొహం వికృతంగా కాలి బొబ్బలెక్కిన గాయాలతో నీరు కారుతూ కుష్టురోగిలా తోచింది. "నో.... నో..... నువ్వు నా భావనవి కాదు" పిచ్చిగా అరిచాడు. మరి మన పెళ్ళి అన్నట్లున్నాయి భావన చూపులు.

"నో. నిన్ను పెళ్ళి చేసుకోలేను. నాకు విశాల హృదయం లేదు. నన్ను క్షమించు భావన నన్ను క్షమించు" అంటూ వడివడిగా వీధిలోకి నడిచాడు మాధవ్.

భారతమ్మ కొంగు నోటికి అడ్డంగా పెట్టుకుని ఏడుస్తోంది.

* * *

"స్టార్ట్ ఇమిడియట్లీ ఫైర్ యాక్సిడెంట్ భావన". టెలిగ్రాం చదువుతున్న శేఖర్‌కి ఒక్కసారిగా మెదడు మొద్దుబారిపోయింది. వెంటనే బయలుదేరాడు. అతడు చేసిన గంట బస్సు ప్రయాణంలో అతడుపడిన మానసిక బాధ వర్ణణాతీతం.

ఇల్లు చేరేటప్పటికి చకచకా మెట్లు దిగివస్తున్న మాధవ్ కనిపించాడు. ఏమైంది భావనకు? ఆతురతతో ప్రశ్నించాడు శేఖర్. అతనికి జవాబు చెప్పకుండానే స్కూటర్ స్టార్ట్ చేసుకుని వెళ్ళిపోయాడు మాధవ్.

గబగబా మెట్లెక్కి "ఏమైందక్కా భావనకి? అసలీ ఘోరం ఎలా జరిగింది?" ఎదురొచ్చిన భారతమ్మని కుదిపేస్తూ అడిగాడు శేఖర్.

భారతమ్మ మౌనంగా భావన గదివైపు నడిచింది. భావనని చూసి బావురుమన్నాడు శేఖర్ "ఏడవకు మావయ్యా ఏడవకు. నా గర్వమంతా పోయింది. అందంతోనే అదీ కాలిపోయింది నాకు మాటిచ్చి తప్పాడు నేను నమ్ముకున్న మాధవ్. ఇపుడు నేను ఎవరికీ పనికిరానిదానను. బాహ్య సౌందర్యం కన్నా అంతఃసౌందర్యం గొప్ప అన్న నీ మాటలే నా చుట్టూ ప్రతిధ్వనిస్తున్నాయి. మావయ్యా నేను కాదన్నా నామీద ప్రేమ చూపావు. ఇప్పుడదే ప్రేమతో కళ్ళనీళ్ళు పెట్టుకుంటున్నావు. చాలు మావయ్య చాలు. నాకీ జన్మకీ తృప్తి చాలు. ఇక నా జీవితం అంతమైపోయినా పర్వాలేదు. అసలు బ్రతికివున్నా ఇంక నన్నెవరు చేసుకుంటారు" విషాదవదనంతో అంది భావన.

"అంత మాటనకు భావన. నేను ఏనాడో చెప్పాను. నా మనస్సు మారదని... నేను అంతః సౌందర్యాన్నే ప్రేమిస్తానని నీవు నాదానివే ఎప్పటికైనా.... నిన్ను విడిచి పెట్టను భావనా.... విడిచిపెట్టను" అంటూ భావన చేతిని తన చేతిలోకి తీసుకుని అన్నాడు.

"నిజంగానా మావయ్యా!" అంత బాధలోను భావన మొహంలో నవ్వు విరబూసింది. కృతజ్ఞతతో కళ్ళు మెరిసాయి.

"అక్కా! టాక్సీ పిల్చుకుని వస్తా! నీవు జాగ్రత్తగా భావనని చూస్తూవుండు. డాక్టరు దగ్గరకు తీసుకుని వెడదాం" పరుగు పరుగున బయటకు వెళ్ళాడు శేఖర్.

"చూశావామ్మా! శేఖర్ హృదయం ఎంత విశాలమైందో" భావనని చూస్తూ అంది భారతమ్మ.

కాలేజీ లెక్చరర్స్ రూమ్‌లో మాధవ్‌తోటి లెక్చరర్స్ తోటి బాతాఖానీ కొడుతున్నాడు. అప్పటికి భావన కాలేజీకొచ్చి రెండు రోజులైంది. "పెళ్ళికి ముందే భావన జీవితం అలా పాడవటం మంచిదైంది" లేకపోతే నీ జీవితమంతా పాడయిపోయి ఉండేది అంటూ అందరూ తమ అభిప్రాయాలు వెళ్ళబుచ్చుతున్నారు.

ఇంతలోకి ఆ రూమ్‌లోకి భావన వచ్చింది వయ్యారంగా, అచ్చు హంసలా, కలహంసలా, తెల్లని వెన్నెలలా వచ్చింది. మాధవ్‌తోపాటు అందరూ ఆశ్చర్యంగా చూస్తూ ఉండిపోయారు. ఎప్పటిలా భావన అందంగా ఉంది. కాలిన మచ్చలు మచ్చుకైనా లేవు. నోటిమాట కూడా రాలేదు ఎవ్వరికీ. నిశ్చేష్టులై చూస్తున్నవారిని ఉద్దేశించి భావన అంది. "నాకు తెల్సు. మీరంతా నోళ్ళు వెళ్ళబెడతారని. నాకేం కాలేదు. మా అమ్మ సలహా అనుసరించి ఓ అయిడియా వచ్చింది. వెంటనే అమ్మ సహకారంతో అమలులో పెట్టాను.

అందుకే అలా నటించాల్సి వచ్చింది. నేను పెట్టిన పరీక్షలో మాధవ్ ఓడిపోయాడు మా మావయ్య శేఖర్ నెగ్గాడు. అతని మనస్సు విశాలమని, పైకి కనిపించే అందాలు శాశ్వతం కావని, కడవరకూ నిలిచేవి అనురాగ బంధాలని, మా అమ్మ జీవితం ద్వారా ఈ పరీక్ష ద్వారా తెలుసుకున్నాను. అందుకు మా అమ్మకి ఎంతో ఋణపడి ఉన్నాను. ఈ మేకప్ చేసుకోవడానికి 10 రూపాయలు ఖర్చు కాకపోతే మాధవ్‌ని చేసుకుని వుంటే నా జీవితమే ఖర్చు అయిపోయేది. బై ది బై నాకు మా మావయ్యకు నెక్స్ట్ వీక్ పెళ్ళి. ఈ రోజు పిలవడానికి వచ్చాను. ఈ రోజు నుండి లీవు పెడుతున్నాను. మళ్ళీ రాలేకపోవచ్చు. మీరంతా తప్పనిసరిగా రావాలి. మీరు కూడా "మాధవ్‌గారు" "మాధవ్‌గారు" అన్న పదాన్ని ఒత్తి పలుకుతూ "మాధవ్" వైపు చూసింది. అసలు విషయమంతా తెలుసుకున్న మాధవ్ సిగ్గుతో తలదించుకున్నాడు. అందరికీ శుభలేఖలు పంచి అందర్నీ మరోసారి ఆహ్వానించి గది బయటకు నడిచింది భావన.

అందరూ విస్తుపోయి చూస్తూండిపోయారు. ❁

## మాటకి మాట

కాష్మీరాషా మంచి మాటకారి. ఎవరయినా వంకరగా మాట్లాడితే వెంటనే మాటకి మాట సమాధానం చెప్పేస్తుంది. నువ్వు ఎక్స్‌పోజింగ్ చేస్తే చాలా బావుంటావు అని ఒక డైరెక్టర్ అడిగాడట. అంతే! వెంటనే ఎక్స్‌పోజింగ్ చేస్తే అందరి మగవాళ్లకి బావుంటుంది. మీ ఆవిడ్ని, మీ అమ్మాయినీ ట్రై చెయ్యండి అందట. అంతలోనే తడుముకోకుండా ఎక్స్‌పోజింగ్ అన్నది ప్రేక్షకుల కోసం, మార్కెట్ కోసం కానీ మీ కోసం కాదు అందట!

